[ఆంధ్రదేశంలోని ఓ మామూలు పట్నంలో, కాలేజీ కుర్రాళ్ల గది. గోడలకు కాలెండర్లు కాక, కొంత మంది సినిమా తారల అంగాంగ ప్రదర్శన లున్న బొమ్మలు. గదిలో ఓ మడత మంచం, రెండు కుర్చీలు, ఓ టేబుల్—దానిమీద ఓ పాత సూట్‌కేస్, క్రింద సిగరెట్ పీకలు, పాత మాగజైన్లు, న్యూస్ పేపర్లు ఉంటాయి.

తెర లేచేసరికి, గోవిందం నెత్తినిండా ముసుగెట్టుకుని కుర్చీలో దిగాలుపడి కూర్చొనుంటాడు, శూన్యంలోకి చూస్తూ. వీథిలోంచి ఆనందం ప్రవేశం.]

ఆనందం : అదేమిట్రా, గోవిందం? కొత్తగా ముండ మోసిన ఆవిడలాగా ఆ అవతార మేమిటి?

గోవిందం : ( దీర్ఘంగా నిట్టూరుస్తాడు. )

ఆనందం : జ్ఞానేంద్రియాలు బంధించి, బొందితో కైలాస మెళ్లాలని తాపత్రయమా! విష్ యు గుడ్‌లక్! ( దగ్గరగా వచ్చి నాడి చూచి ) ఫరవాలేదు. నాడి అందుతూనే ఉంది. ఓరేయ్, గోవిందాచారీ! నాకు తిక్క రేగిందంటే తెలుసుగా, వీపు డోలులా వాయించేసి, చర్మ వాద్య కచ్చేరీ చేస్తాను—తెలిసిందా?

గోవిందం : ( మాట్లాడడు. )

ఆనందం : నీకు బ్రహ్మంగారు నా చేతిలో 'హరీ' అనే యోగం ప్రసాదించటం నీ అదృష్టం! వన్, టు, త్రీ అన్నానో కాసుకో! నీ మొహం అప్పడంలా నలిపెయ్యగలను... అనేదా?

గోవిందం : వద్దు!

ఆనందం : అమ్మయ్య! చావు ఓ ఇంచి ఎడంగా తప్పిపోయింది. మై హార్టీ కంగ్రాచ్యులేషన్స్! ఇహ ప్రారంభించు. నీ ఈ అవస్థకు కారణం ఏమిటి! ఏమయ్యింది!

గోవిందం : ( మాట్లాడడు. )

ఆనందం : కమల నవ్విందా?

గోవిందం : అంత అదృష్టమా!

ఆనందం : సత్యవతి పలకరించిందా?

గోవిందం : నన్నా ... ఉహూ!

ఆనందం : శారద నిన్ను చూసి పాట పాడిందా? అదీ అయ్యుండదు. నిన్ను చూస్తే ఏ ఆడదానికి ఇన్స్‌పిరేషన్ వస్తుంది గనక! పూర్ ఫెలో! ప్రిన్సిపాల్ ఔరల్ ఫీజ్ కట్టలేదని చీవాట్లు తినిపించాడా?

గోవిందం : ఆయన కంత ధైర్య మెక్కడిది?

ఆనందం : కరెక్టే! అమాత్రం ధైర్యమే ఉంటే పోలీస్ డిపార్ట్‌మెంట్‌లోనే చేరేవాడు. ఊఁ! ఇంతకూ విషయ మేమిట్రా, బాబ్జీ! చెప్పు! వెధవ సస్పెన్స్‌తో ప్రాణం ఓల్లార్చుకు పోతున్నది.

గోవిందం : మా నాన్న ...

ఆనందం : పోయాడా?? వాటె వండర్‌ఫుల్ ఫెలో! ఇన్నాళ్లకు నీ చిరకాల వాంఛితం నెరవేరినందుకు మై హార్టీ కంగ్రాచ్యులేషన్స్, బోయ్! మాన్! నా ఆనందం ఎలా తెలపాలో తెలియటం లేదు. ఓ పాట పాడేదా?

గోవిందం : నోరు మూసుకుంటావా?

పాత్రలు :

గోవిందం
ఆనందం
గుర్నాథం
అప్పారావు
నరసింహం

ఆనందం : కరెక్టే రోయ్! తండ్రంతటి వాడు పోతే ఏడవాలి గదూ? సారీ, బ్రదర్! మరిచే పోయాను. గోవిందాచార్లూ! మీ ఇంటి పేరు నాకు తెలియదు. అయినా, నన్ను అపార్థం చేసుకోకు, గోవిందాచార్లూ! మీ తండ్రిగారు ఇలా ఉత్తరం ముక్క, వీలునామా రాయకుండా అకాల మరణం చెంది విష్ణు సాయుజ్యం చెందినందుకు నా మనస్సెంతో దుఃఖపడుతున్నది. ఊరుకో! వెధవది బాధే! కానీ ఏం చేస్తాం! భరించాలి! లే! అలా ఏడవకు! ఓ రెండు నిమిషాలు ఆయన పవిత్రాత్మకు శాంతి ప్రసాదించమని వేడుకుందాం! లే!

గోవిందం : ఒరేయ్, ఆనందా! నన్ను రెండే రెండు నిమిషాలు మాట్లాడనిస్తావా? ప్లీజ్! చచ్చి నీ కడుపున పుడతాను!

ఆనందం : నిజంగానా? వెధవా! ఇంతకాలం కలిసి మెలిసి ఉన్నామే — దాని కిదట్రా ప్రతిఫలం! నీచుడా! డాగ్! కంట్రీ జాకార్! మళ్లీ అను ఆ మాట! అనూ!

గోవిందం : ఏమిట్రా ఏమన్నాను?

ఆనందం : బఫెలో! జిరాఫీ వెధవా! నువ్వు నా కడుపున పుడతావా? ఎంత ధైర్యంరా నీకు! ఒరేయ్, అలాంటి దురుద్దేశంతో మటుకు నాతో స్నేహం చెయ్యకు. అండర్‌స్టాండ్! తెలిసిందా?

గోవిందం : పొరపాటైంది. క్షమించు!

ఆనందం : అసలే తండ్రి పోయాడన్న దుఃఖంలో ఉన్నావని వదిలేస్తున్నాను. మరోసారైతే మిల్లీమీటర్ల లెక్కన నరికి, ఉప్పూ కారం అద్ది, ఆవకాయలో నంచుకుని ఉండేవాణ్ణి ... సరే, యూ కెన్ ప్రొసీడ్! ... సిగరెట్టుందా!

గోవిందం : లేదు!

ఆనందం : లేదూ? వెధవా! నీ మొహం చూస్తేనే అష్ట దరిద్రాలు మీదపడి కౌగలించుకుంటాయి! ... సరే, ఏడు!

గోవిందం : క్షణం ఆగు ... అదిగో, ఆ మూల.

ఆనందం : ఏమిట్రా అది? ( లేచి కుర్చీ ఎక్కుతాడు. ) ( గోవిందం అడుగులో అడుగు వేసుకుంటూ ఓ మూల కెళ్లి తీక్ష్ణంగా పరిశీలించి చూసి, ఆ చెత్తలోంచి ఓ సిగరెట్ పీక తీసి )

## తారక రామారావు

గోవిందం : ఇదిగో! ఇది నీదే!

ఆనందం : నిజంగా నాదేనా! అబద్ధమాడితే పురుగులు పడి చచ్చిపోతావు. ఆనక నీ ఇష్టం!

గోవిందం : నీ ఇష్టం! ఏదో మరీ ఆపదలో ఉన్నావని ఇస్తున్నా. లేకపోతే నేనే లాగించేస్తాను.

ఆనందం : బాబ్బాబు. ఇచ్చెయ్యి. గంటాయె సిగరెట్టు మొహం చూసి. ( సిగరెట్టు కాల్చుకుని అగ్గిపెట్టె గిరవాటేసి ) ఒరేయ్, గోవిందా! దీనితోపాటూ నీ ఉపన్యాసమూ పూర్తవ్వాలి! తెలిసిందా! కానియ్యి.

గోవిందం : మా నాన్న ...

( బయటి నుంచి— "ఎవరయ్యా ఇంట్లో?" )

ఆనందం : వీ డెవడు రామాయణంలో అభిమన్యుడిలా! ... ఎవరయ్యా అది?... ఆఁ!

( గుర్నాథం ప్రవేశం )

గుర్నాథం : ఏందలా చూస్తున్నావ్! నేను గుర్నాథాన్ని!

ఆనందం : ( తేరుకుని ) అయ్యా, గుర్నాథంగారూ! క్షమించండి! తండ్రిపోయిన దుఃఖంలో వాడికి మనుషులంతా అలికేసినట్లయి, నామరూపాలు తెలియకుండా పోయారు. ఒరేయ్! అలా గుడ్డల స్టాండులా నిలబడక పోతే ఆ కుర్చీ ఇలా తేరాదూ!

గుర్నాథం : వద్దులే! నిలబడే ఉంటా! కొట్లో కూసొని, కూసొని ప్రాణం చాలొస్తున్నది! ... అది సర్లే! గదెప్పుడు ఖాళీ చేస్తున్నారు?

ఆనందం : గది ఖాళీ చెయ్యడ మేమిటి? ...ఏరా, అలా అని చెప్పావా గుర్నాథంగారితో? ఛ! వెధవా! ఇంద్ర భవనం లాంటి ఈ గది వదిలేస్తే, మన పాట్లు ఆ దేవుడి కెరుక! అయ్యా! వా డే గుణాన ఉండి ఆ మాట అన్నాడో మరి! చూడండి. మరోజన్మంటూ ఉంటే మాత్రం, మే మిక్కడే ఉండిపోతాం.

గుర్నాథం : ఇదిగో! డబ్బులియ్యకుండా ఈ బేవారసు ఖాతా ఏందయ్యా మాకు! గదేమో ఇంద్ర భవనమా! అయితే, నాకు తెలియ కడుగుతాను, డబ్బు లియ్యకుండా ఇంద్రభవనం, చంద్రభవనం అంటే ఎలా? ఇదిగో, మీతో మాకు పేచీ ఎందుకుగానీ, అద్దె బకాయి చెల్లించి, గది ఖాళీ చెయ్యండి.

గోవిందం : చేస్తాం లేవయ్యా! బోడి గది ఎలాగైతేనేం కట్టించావ్! గుర్నాథం! దీనికంటె మునిసిపాలిటీ పాయిఖానా నయం!

గుర్నాథం : ఏంటువ్నావ్?

గోవిందం : మళ్లీ అంటాను.

ఆనందం : ఒరేయ్, గోవిందా! నువ్వు కాస్సేపు శాంతం అభినయించరా, తండ్రీ!

గోవిందం : ఒరేయ్! నువ్వు నోరుమూసుకో! ఏమయ్యా ఇది గదేనా! తలకాయ ఉన్న వాడెవడూ దీన్ని గదనడు. సూర్యోదయం మొదలు, అస్తమయం వరకు ఎండంతా దీంట్లోనే గదా! ఇహ వానొస్తే, ఇదిగో, ఈ గదిలో ఉండేకంటే అలా రోడ్డు మీద ఉంటేనే నయం. వాన వెలిసిన రెండు రోజులదాకా మునిసిపాలిటీ పంపులా చుక్కలు పడుతూనే ఉంటాయి. ఇవి గోడలేనా అసలు! రాత్రిళ్లు



వరుడు కావాలి!
A.S. Murty

గట్టిగా నిద్రపోవటానికి వీల్లేదు కదా! ఎందుకో తెలుసా?

గుర్నాథం : ఎందుకేమిటి?

గోవిందం : ఎలకలు, పిల్లులు తెల్లార్లూ కుస్తీపోటీలు, రన్నింగ్ రేసులూను. ఇహ బొద్దెంకలు, బల్లులు, పారీళ్లు—అయ్యా,గుర్నాథంగారూ! మా కర్మకాలి, ఇదిగో, ఈ నరకం అనుభవిస్తున్నాం. దీని కంటే సెంట్రల్ జైలు నయం. నువ్వెప్పుడన్నా జైలు కెళ్లావా!

గుర్నాథం : లేదు!

గోవిందం : పోనీ ఓ రోజు వెళ్లి చూసిరా! మా చుట్టాలెవరూ లేరక్కడ. ఈ బోడి గదికి ముప్ఫయి రూపాయిలా అద్దె! అదీ మేము గాబట్టి ఇస్తున్నాం. మరొకరైతే మీరు ఎదురిచ్చినా ఇందులో ఉండరు— తెలిసిందా? అయినా, గుర్నాథం! ఓ మాట అడిగేదా?

గుర్నాథం : అడుగు!

గోవిందం : ఇంత కక్కుర్తిపడి సంపాదించిన డబ్బు ఎలా అరుగుతుందయ్యా మీకు! మీరు పూర్వజన్మలో రాక్షసులై ఉంటారు. అవునా?

గుర్నాథం : ఇదిగో, గోవిందం, నాకు కోపమొస్తే మనిషిని గాను — తెలిసిందా?

గోవిందం : రాకపోయినా మనిషివి గాదు! ఇక మీ హోటలు — అక్కడ తినే కంటే జనరల్ హాస్పిటల్‌లో మందు తాగితే సుఖంగా చావచ్చు. మీ హోటల్లో ఎంగిలిపడ్డ వాడు మూడు నెలలు మంచంలో, ఆర్నెలలు హాస్పిటల్‌లో పీక్కు చావాలి. తెలిసిందా? నడు, నడవ్వయ్యా బయటకు, ఇంకా గానుగ స్తంభంలా నిలబడ్డావు దేనికి? పద.

గుర్నాథం : ఏంట్రా కూశావ్! చింపాంజీ వెధవా! నీ కీలు కీలు విరిచేసి ఇడ్లీ పిండిలో కలిపేస్తాను. చద్ది పూరీలా మొహం నువ్వూను. ఇంత లేసి మాట లంటావురా, రాస్కెల్!

ఆనందం : అయ్యో! శాంతింపుడు ... గోవిందా, నువ్వే గెలిచావురా!

గోవిందం : ( ఆశ్చర్యపోయి ) నే గెలవట మేమిటి?

ఆనందం : ఓరి వాజమ్మా — అప్పుడే మరిచి పొయ్యావా! ... అయ్యా, గుర్నాథంగారూ! మీరు భీముడి వేషానికి ఫిట్టు! ఇక గుర్రం దిగండి.

గుర్నాథం : ఏందయ్యా నువ్వనేది!

ఆనందం : అలా రేచు కుక్కలా తరమకండి మరి! కూర్చోండి ... వీడు, అనగా శఠగోపం గోవిందాచార్లూ, నేనూ పందెం వేసుకున్నాం.

గుర్నాథం : ఏమని?

ఆనందం : 'ద్రౌపదీ స్వయంవరం' నాటకంలో భీముడు వేషానికి మీకు మీరే పోటని వీడూ, కాదురా,గోవిందం!గుర్నాథం సుద్దముక్కలా, చలిమిడి ముద్దలా ఉంటాడు! నా మొహం ఆయనకు పౌరుషం రాదు. కోపం అసలే ఎరగడు. బుద్ధుడి తమ్ముడు కనక ఆయన 'కృష్ణలీలలు' నాటకంలో మొద్దబ్బాయికి తప్ప పనికి రాడు అని నేనూ పందెం వేసుకున్నాం! దేనిమీద? బీడీముక్క మీద! బాగుందా?

గుర్నాథం : చాలా బాగుంది! ఆ తర్వాత?

ఆనందం : వాడు, శఠగోపం గోవిందాచార్లు, చూస్కో, ఆ సుద్దముక్కల్లోంచి పొగలు తెప్పిస్తాను. చలిమిడి ముద్దలోంచి లేడి తెప్పిస్తాను. పిప్పళ్ల బస్తాలాంటి వాడి చేత తోకతెగిన కోతిలా గెంతిస్తాను అనన్నాడు. అన్నది చేసి చూపించాడు. అమ్మమ్మ! మీలో ఇంత పౌరుషం ఉందని తెలియదు సుమా! నామటుకు నాకు మిమ్మల్ని చూస్తే అడివి దున్నను చూసినట్లయింది! ఇశ్ఁ! ఒరేయ్, గోవిందా! బీడీ ముక్క నువ్వే గెలిచావ్ ... ఇంద ( జేబులో చెయ్యి పెట్టుకు చూసి ) అరె! బీడీ ఏమైందబ్బా! ఆఁ! చూడండి, గుర్నాథంగారూ! సిగరెట్ అప్పివ్వండి! వెధవది బాకీలుంటే నాకు అరక్షణం నిద్ర పట్టదు.

గుర్నాథం : ఇంద సిగరెట్! అయితే, గోవిందాచార్లూ! నేను భీముడు వేషానికి ఫిట్టేనా! ... ఏందయ్యోయ్ మాట్లాడవు!

గోవిందం : ఆఁ! ఆఁ! మీరు ఒక భీముడేమిటి, కీచకుడు, రావణాసురుడు, వాడి తండ్రి, పినతండ్రి— అన్నిటికీ మీరే ఫిట్టున్నర. బెస్టున్నర. అసలు మీకు మేకప్ అక్కర్లే. ఇలా మఫ్తీలోనే మీరు వాళ్లను గుర్తుకు తెస్తారు. పసిపిల్లలు జడుసుకుంటారు. పక్షులు నీళ్ళ త్రాగవు. లేగదూడలు పాలు తాగవు.

గుర్నాథం : భలే చెబుతావయ్యా మాటలు. నాచేత భీముడు వేషం వేయించు, ఇక చూస్కో... వస్తా మరి!

ఆనందం : త్వరగా వెళ్లండి! వచ్చి చాలాసేపైంది! ఇదిగో, మెట్లు జాగ్రత్తగా దిగండి.

గుర్నాథం : భలేవాడివయ్యా, ఆనందం! నా కీ మెట్లేం కొత్తా! వస్తా మరి! ( గుర్నాథం వెడతాడు. )

ఆనందం : అమ్మయ్య! శనిగ్రహం వదిలింది.

గుర్నాథం : ( ప్రవేశించి ) అది సరేలే గానీ! అద్దె! వట్టి చేతులతో వెడితే మా అయ్య నరసింహావతార మెత్తుతాడే!

ఆనందం : చూడండి, గురువుగారూ!

గుర్నాథం : ఇదిగో, ఆనందం! నా పేరు జీడిముక్కల గుర్నాథరావు. గుర్తుంచుకో. రేపు పేపర్లో కూడా అట్లాగే వేయించాలి! ఆఁ! ఇప్పుడు మటుకు గుర్ో అను. ఫర్వాలేదు.

ఆనందం : అలాగే! ఎంతమాట! . . . పాపం, మన గోవిందాచార్లు వాళ్ల నాన్న పోయాడు.

గుర్నాథం : ఎక్కడికి?

ఆనందం : ఎక్కడికని చెప్పమంటావు! జీవితం ఖర్చు వ్రాసేసుకుని, పద్దు ఎత్తేసుకుని వెళ్లి పోయాడు, వేరే లోకం లోకి!

గుర్నాథం : ఆహాఁ! అది సరిలే! బిజినెస్సంతా లాసేనా?

ఆనందం : ఆహా! లైఫంతా లాసు, సంసారం ప్లస్సూను. చావకేం చేస్తాడు — ఇద్దరాడపిల్లలు, గాలి గోపురాల్లా పెళ్లికెదిగి ఉత్సవ విగ్రహాల్లా ఇంట్లో ఉంటే? జీవితానికి మంగళ హారతి పాడేశాడు. అదుగో, వాడు ఆ దుఃఖంలో ఉన్నాడు. వాడు కాస్త తేరుకుని మామూలు మనిషి కాగానే, పువ్వుల్లో పెట్టి మీ అద్దె డబ్బు పంపుతాము. సరేనా?

గుర్నాథం : అలాగే! మరి వస్తా! ... ఇదిగో, గోవిందం! బెంగెట్టుకోకు, ... వస్తా. ( బయటికెడతాడు. )

ఆనందం : ( గుర్నాథం వెళ్లిన వేపు కోపంగా చూసి ) వెధవన్నర వెధవ! భీముడు వేషం వేస్తాడుట! నయం, తాటకి తమ్ముడిగా వేస్తాననలే! ( గోవిందం ముడుచుకు కుర్చీలో కూర్చోనుండడంచూసి )అయినా,గోవిందం, నీకు కోపమొస్తే వెనకా ముందూ చూడవు. వాడి మీదకు ఒంటికాలిమీద వెళ్తావే!


కాయకల్ప చికిత్స

హృదయము, ఊపిరితిత్తులు, పైత్యకోశము పూర్తిగా శిథిలము కాకుంటే, రోగి తిరిగే స్థితిలో వుంటే, యీ చికిత్స పొంద వచ్చును. 3 లేక 4 మాసములలో యీ చికిత్సవల్ల దేహములో వున్న అన్ని వ్యాధులు నివారణ మగుటయేగాక, సగము వయస్సు కలిసి వచ్చును. అనగా 60 సంవత్సరములవారు యీ చికిత్స పొందిన 30 సంవత్సరముల ప్రాయములో వారికి వున్న యవ్వనము కలుగును. ఇంగ్లీషు, ఆయుర్వేద, యునాని, హోమియోపతి, ప్రకృతి వైద్యములవల్ల సాధ్యముకాని అన్ని వ్యాధులు నివారణమగును. వివరములు కోరువారు పోస్టు ఖర్చులకు రు. 2-00 M.O. పంపవలయును.

శ్రీ యోగాశ్రమము
పెదవాల్తేరు పోస్టు,
విశాఖపట్టణము - 3.

అరె నీ సాహసం గూల! వాడే తలుచుకుంటే నీ బుర్ర ఓపెనర్ లేకుండా, సోడాకాయలా కొట్టేసేవాడు.

గోవిందం : నిజమా?

ఆనందం : నిజమా! పోనీ, ఓ సారి వాడి దెబ్బ చూస్తావేమిటి! పిలిచేదా!

గోవిందం : వద్దు, వద్దు.

ఆనందం : తొలి రోజు తెలుగు సినిమాకు టికెట్టు తేలేవు! నీ కెంత పౌరుషం వచ్చింది! వెధవది సమయానికి నా బుర్ర సూదంటురాయి లాగా పనిచెయ్యబట్టి సరిపోయింది. లేక పోతే మీ నాన్నతో నువ్వూ చాలా దూరం వెళ్లి ఉండేవాడివి! ... ఊఁ. సరిలే! అసలు సంగతి చెప్పు.

గోవిందం : మా నాన్న ...

ఆనందం : ఓరి మహాప్రభో! అరిగిపోయిన రికార్డు లాగా మా నాన్న ఏమిట్రా, తండ్రీ! ఆ తరవాత చెప్పరా! ... అగ్గిపెట్టుందా?

గోవిందం : లేదు! ఖాళీ పెట్టుంది.

ఆనందం : ఎందుకూ మెళ్లో కట్టుకు తిరగడానికా? ఆహా ఏం లైఫురా, దేవుడా! సిగరెట్టుంది! అగ్గిపెట్టె లేదు. అందం ఉంటుంది, అదృష్టం ఉండదు. చదువుంటుంది ఉద్యోగం ఉండదు! ... ఏమిటో అంతా మాయ! కానియ్యరా, గోవిందా!

గోవిందం : ఏమనుకోక ... మా నాన్న...

( బయటి నుంచి ఈలపాట వేసుకుంటూ గాలి దుమారంలా అప్పారావు ప్రవేశం )

అప్పారావు : అందరికీ వందనాలు! ఎందరో మగాను బావులు! !

ఆనందం : ఓరి నీ తెలివి మండ! మగాను బావులు ఏమిట్రా!

అప్పారావు : తప్పా? ఏం చేస్తాంరా! ప్రొద్దున్నే లేచి అద్దం చూసుకున్నా — అదే మొదలు! మా ఆవిడ పంచదార లేదని, అది లేకుండా కాఫీ ఇచ్చింది! సిగరెట్టుపెట్టె మా పని మనిషి పొరపాటున చెత్త కుండీలో పారేసింది! రోడ్డుమీద తెలిసిన అడ్డ గాడిద ఒక్కడూ కనబడలే! దానితో మనసు, తెలుగు సినిమాలో క్లైమాక్సు లాగై ఇలా వచ్చా!

ఆనందం : మంచిపని చేశావు! ... అగ్గిపెట్టుందా?

అప్పారావు : సిగరెట్టుందా!

ఆనందం : ఒకటే ఉంది!

అప్పారావు : నాకేం అక్కర్లేదు లేవోయ్! నీకు కొరివి పెట్టాలి! అంతేగా? ఆ సిగరెట్ ఇలా ఇవ్వు!

ఆనందం : ఒకటే ఉందిరా అంటూంటే!

అప్పారావు : అబ్బా! ఆనందం! నే నేం ఆ బోడి సిగరెట్టు కాల్చను. గోవిందం మీద ఒట్టు, సరేనా?

ఆనందం : మరి ఇదెందుకురా, చెవులపిల్లీ!

అప్పారావు : అలా అడుగు, చెబుతాను. దారే పొయ్యే దానయ్యగార్ని సార్, అగ్గిపెట్టుందా? అనడిగామే అనుకో! ఏమంటాడు?

ఆనందం : ఏమంటాడు?

అప్పారావు : దేనికి? అంటాడు. అప్పుడు మనచేతిలో కనీసం బీడీ ముక్కయినా లేకపోతే ఆ సోమయాజిగారు, ఎవ్వడ్రా పీడు! పీడికి అగ్గెందుకు? అని ప్రకాశముగా అనుకుని వెడతాడు. కనక ( ఆనందం చేతిలో సిగరెట్టు తీసుకుని ) దీన్ని నమూనాగా చూపించీ, 'గాలెక్కువ సార్! ఓ పట్టాన వెలగటం లేదు. అందుకని మీరేమీ అనుకో నంటే రెండు పుల్లలు తీసుకుంటా' నంటే, వాడు 'మాబాబే అలాగే కానియ్యి' అంటాడు... వస్తా. ( వెడతాడు. )

ఆనందం : ఒరేయ్! అప్పారావు! సిగరెట్ ఎంగిలి చేశావో నీ ప్రాణాలు హేంగర్‌కు తగిలిస్తాను ... ఏమిట్రా అలా గోడకు కొట్టిన మేకులా ఉన్నావు? కానియ్యి.

గోవిందం : మా నాన్న...

ఆనందం : ఓరేయ్! ఆ ముక్క మళ్లీ కూశావో నాలుక పీకేస్తాను. మీ నాన్న ఏం చేశాడు?

గోవిందం : ఉత్తరం వ్రాశాడు.

ఆనందం : ఉద్ధరించాడు. ఏమంటాడు?

గోవిందం : నాకు పెద్ద తప్ప మొచ్చింది— అంటే మా నాన్నకు. కనక నీ పెళ్లి చేద్దామని ఉంది! అంటే నా పెళ్లి!

ఆనందం : ఓరినీ! ఎంత అదృష్ట వంతుడివిరా! మీ నాన్న ఇన్నాళ్లకు తెలివినబడి, నీకు బ్రహ్మ చర్యం ఒంటబట్టదని గ్రహించాడు. భేష్! ఇంతకూ పిల్లెవరు? పేరేమిటి? ఊరేది? ఆ అమ్మాయి నీకే భార్య కావటానికి క్వాలిఫికేషన్స్ ఏమిటి?

---

### ఆడ—మగ

ఇప్పటి అందచందాలను చూచి ఆడపిల్లల్ని ప్రేమిస్తారు. రేపు రాబోయే అదృష్టాన్ని జత చేసి మగపిల్లల్ని ప్రేమిస్తారు.

—గెథే

---

గోవిందం : అవేం వ్రాయలే! పిల్ల తండ్రిని గురించి వ్రాశాడు!

ఆనందం : అంటే పెళ్లి ఆయనకా, నీకా!

గోవిందం : ఏమో మరి!

ఆనందం : అసలేం వ్రాశాడో చెప్పరా!

గోవిందం : నరసింహంగారని, ఇక్కడకు పదిమైళ్లలో, ఓ ఊళ్లో ఓ మనిషి ఉన్నాడుట!

ఆనందం : ఏమిట్రా? ఊరంతటికీ ఓ మనిషేనా ఉంది!

గోవిందం : అబ్బ! ఇలా బోడి విట్లు వేస్తే అసలు చెప్పను.

ఆనందం : వెయ్యను. మిగతా కథ కానియ్యి.

గోవిందం : ఆయనకు ఒక్కగానొక్క కూతురుందిట!

ఆనందం : ఆహా! ఆయ నెవరో కనబడితే బాగుండును.

గోవిందం : దేనికి? ఎందుకు?

ఆనందం : కుటుంబ నియంత్రణ ప్రచార శాఖకు బహుమతిగా ఇయ్యవచ్చు. వాళ్లు, ఇదుగో, ఈయన ఆదర్శ పౌరుడు. ముప్ఫై ఏళ్ల కాపురానికి ఒక్కగా నొక్క ఆడపిల్లను పుట్టించాడు. మీరూ ఆయనలా కుటుంబ నియంత్రణ పాటించండి! అని ప్రకటన ఇచ్చేస్తారు.

గోవిందం : నాయనా, ఆనందం! ఇలా రన్నింగ్ కామెంటరీ చేస్తుంటే నే నసలు చెప్పను.

ఆనందం : చెప్పరా! నీ కీనాటికి పెళ్లి కళ వస్తున్నందుకు సంతోషం! అంతే! మరేం లేదు. చెప్పరా!

గోవిందం : ఆయన ఏకైక పుత్రికా రత్నాన్ని నాకిచ్చి...

ఆనందం : వివాహం చేయ దైవజ్ఞులు సుముహూర్తం నిర్ణయించారు గాన తాము బంధు మిత్ర పరివార సమేతంగా విచ్చేసి, వధూవరుల నాశీర్వదించి, మదర్పిత చందన తాంబూలాది సత్కారముల నంది, నన్నానందింప చేయ ప్రార్థన. ఇట్లు భవదీయుడు. మంగళమ్ మహల్. క్వాలిటీ పవర్ ప్రెస్... అంతేగా? ఓ. కే! ఒరే, గోయిందా!

గోవిందం : నా బొంద! ఉత్తరం పూర్తిగా విను! ఆ నరసింహంగారు అధాయినా వచ్చి నన్ను చూసి, యక్షుడులా ప్రశ్నలు వేసి, పశువుల డాక్టరులా పరీక్షించి, నచ్చితే, ఆ తర్వాత పెళ్లి చూపులు! ఆయన కూతురు గూడా చూసి ఫర్వాలేదు అంటే, అనక పెళ్లి! ఇంకా చాలా కథుందిరా, భగవాన్లూ!

ఆనందం : అమ్మమ్మ! గోవిందం! ఈ నరసింహం అనే శాల్తీ చూడ, చూడ చాలా గట్టి పిండంలా కనబడుతున్నాడు. అవునా!

గోవిందం : అవునా ఏమిటి? ముమ్మాటికీ నిజం!

ఆనందం : కనక వాడిని మాయచేసి, అదరగొట్టి, హడావుడి చేసి, మన లైనుకు తేవాలి! అంతేనా? ( ఆలోచిస్తూ ఉంటాడు. )

గోవిందం : అంతే! కాకపోతే లోకంలో ఎక్కడైనా పిల్లను చూస్తారు. కట్నం కానుకలు మాట్లాడుకుంటారు. అంతేగాని ఇదేమిట్రా! ఆయన నన్ను చూసేదేమిటి? నా శ్రాద్ధం! ... ఒరేయ్! ఆ మూకాభినయం మానేసి, నన్నీ పద్మవ్యూహంలోంచి తప్పించరా!

ఆనందం : ఒరేయ్! అలా చెవి కోసిన నక్కలా రొద పెడుతుంటే నాకేం తోచి ఛస్తుంది! ... ఏడీ! ఈ జడ్డి వెధవ సిగరట్టు పట్టుకు అటే పోయినాడు ... ఆఁ అది సరే! ఆ నరసింహంగారి రాకను పురస్కరించుకుని, ఓ ఆహ్వాన సంఘాన్ని ఏర్పాటు చేసి, ఘనంగా గజారోహణం, కవిసమ్మేళనం ఏర్పాటు చేస్తే ఆయన ఐసులా కరిగి పోడా అని!

గోవిందం : అది కాదురా, పీనుగా! ఆయన పేరుకు తగ్గట్టు, నిజంగా నరసింహంట! ఆయన కీ దుబారా నచ్చక కాలిన పెనం మీది నీటి చుక్కలా చిటపటమంటే ఇంకేముంది! నాకు పెళ్లి కాదు గానీ, మా నాన్న భరత నాట్యం, ఒడెస్సీ, కథాకళీ అన్నీ కలిపి డాన్సు చేసి, వేమూరి గగ్గయ్యలా పూనకం వచ్చి

'రేయ్! గోవిందా! నీకు బాగుపడే యోగం లేదు! గుళ్ళో పళ్ళెం పుచ్చుకు మంత్ర పుష్పం ఏడు' అని శపించేస్తాడు. అప్పుడు ఈ ప్రాపుండదు. గోష్పాదమంత పిల కెట్టుకుని, నామాలు, రాగిచెంబు, ఉద్ధర ణితో ... బాబోయ్! ఆనందా! వద్దు, పగ వాడికైనా ఆ నరకం వద్దు! నన్ను కాపాడరా!

ఆనందం : ఒరేయ్! ఆ ఏకపాత్రాభినయం మానేసి నే చెప్పినట్లు వింటావా?

గోవిందం : చెప్పు! నువ్వేం చెయ్యమన్నా చేస్తాను!

ఆనందం : నీ పెళ్లి చేసే పూచీ నాది! బెంగెట్టుకోక! అయితే ఒక షరతు.

గోవిందం : త్వరగా చెప్పరా!

ఆనందం : ఆ నరసింహం వచ్చి వెళ్ళేంతవరకూ నో రెత్తకు. మూగ మొద్దులా కూర్చో! కథ నే నడిపిస్తాను. సరేనా?

గోవిందం : ఆయనేం అడిగినా మాట్లాడకూడదా?

ఆనందం : కూడదు! నీ కసలు సందర్భ శుద్ధి నీస మెత్తు తెలియదు. వాగితే కృష్ణమీనన్‌లా వాగెయ్యటం! లేకపోతే బొడ్డురాయిలా ఉండటం — అంతే తెలుసు నీకు. కనక నా మాట విను. బాగుపడు.

గోవిందం : అలాగే.

ఆనందం : అవునూ! ఆ నరసింహం అనే శాస్త్రి ఎప్పుడైనా రావచ్చుగా?

గోవిందం : ఆహా! పౌరాణిక సినిమాలో నారదుడిలా, తోలుబొమ్మలాటలో హాస్యగాడిలా, సమయం సందర్భం లేకుండా ఎప్పుడైనా రావచ్చు.

ఆనందం : రైటో! మనం ఇలా శరణార్థుల్లా ఉంటే, ఆయన బాధపడచ్చు. నే నీ గదంతా సర్దు తాను. నువ్వెళ్ళి ముఖం కడుక్కురా, వెళ్ళు.

( గోవిందం లేచి లోపలకు వెళ్లబో తుండగా అప్పారావు ప్రవేశం. )

ఆనందం : ఏరా, నిప్పేదీ! ... ఓరి, అప్రాచ్యుడా! సిగరెట్ కాల్చేస్తున్నావా, రాస్కెల్!

అప్పారావు : కోప్పడకురా! చిన్న పొరపాటయిపోయింది. బయట రోడ్ మీద బీటు కానిస్టే బుల్‌లా నిలబడ్డా! ఓ పెద్ద మనిషి కనబడ్డాడు! సార్ అన్నా. నన్నో చీడ పురుగులా చూసి, 'ఎద్దులా ఉన్నావు! పనీ పాటూ చేసుకోరాదూ ఇలా వీథులెంట ముష్టెత్తుకోక పోతే!' అని కసిరి వెళ్ళి పోయాడు! ... ఏరా! నే నలా ఉన్నానా?

గోవిందం : నీ తప్పుకాదురా! నిన్ను చూస్తేనే అలా అనిపిస్తుంది!

అప్పారావు : ఏడిశావు వెధవా! పోనీలే పెద్దమనిషి గదా అని ఊరుకున్నా! లేకపోతే వాడి తాత గుర్తుకొచ్చేలా గూబ వాయించేవాడిని.

ఆనందం : ఆ తర్వా తేమైంది?

అప్పారావు : ఓ రిక్షావాడు కనబడితే, సిగరెట్ చూపించా! వాడు 'అగ్గిపెట్టె లేదు, గురో' అని లైట రిచ్చాడు. షా చేసే దేముంది? అయినా పూర్తిగా తాగలేదు. ఈ కాస్త నువ్వు లాగించెయ్యరాదూ!

ఆనందం : నీ శ్రాద్ధం శని వెధవా అని! వెళ్ళు! ... ఒరేయ్! గోవిందా, నువ్వు కానియ్యి.

గోవిందం : అలాగే ( గోవిందం లోపలి కెడతాడు. ఆనందం గది సర్దటం మొదలెడతాడు.)

అప్పారావు : ఏమిటి, గురో, గదంతా శుభ్రం చేస్తున్నావు? ఏమిటి కథ?

ఆనందం : ఒరే! అప్పారావూ, డబ్బులేం లేవు. నువ్వు శ్రాద్ధపు గద్దలా ఉండక్కరే, వెళ్ళు!

అప్పారావు : నేను అప్పుకు రాలేదు! ఆ విషయాలకేం గానీ, ఏమిటి సంగతి?

ఆనందం : గోవిందాన్ని చూట్టానికి పెళ్ళివా రొస్తున్నారు.

అప్పారావు : నిజమా? ! ... ఎప్పుడు?

ఆనందం : ఏ క్షణంలోనైనా రావచ్చు!

అప్పారావు : ఊహూఁ. అదా సంగతి? అందుకే నన్ను మాట, గోవిందం విగ్రహాన్ని పులికాపు చెయ్యటానికి వెళ్లింది!

ఆనందం : కనక నువ్వెళ్ళు! ఆ వచ్చే ఆయన నరసింహం గారని బలే కోపిష్ఠి లే! రాగానే బ్లాక్‌బోర్డు మొహంతో నువ్వు కనబడితే ఆయన నిజంగా సింహం కావచ్చు.

అప్పారావు : ఏడిశావు! హనుమంతుడి ముందరా కుప్పి గంతులు! ఆయనచేతే కప్పగంతులు వేయిస్తాను! నా సంగతి తెలుసుగా? తాలూకా ఆఫీసులో గుమాస్తాను!

ఆనందం : అవునూ! ఈవేళ ఆఫీసు లేదా ఇలా తగల డ్డావు!

అప్పారావు : ఎవరో మంత్రిగారు కాలు జారి బాత్ రూమ్‌లో పడిపోయి హరీ అన్నాడుట! అందుకని సెలవు! మంత్రుల వల్ల దేశాని కేదన్నా ఉపకార మున్నదయ్యా అంటే ఇదొక్కటే!

ఆనందం : అప్పారావూ! సెలవు కదా? భార్య కొత్తగా కాపురాని కొచ్చింది కదా? మీ ఆవిడను తీసుకుని అలా షికారు కెళ్లకూడదూ?

అప్పారావు : షికారేం ఖర్మ! సినిమాకే వెళ్ళాలని ఉంది! 'అత్తను గుద్దిన కోడలు' సినిమా బాగుంది అని మా ఆవిడ రాత్రిళ్ళు ఒకటే గును స్తున్నది!

ఆనందం : మరి వెళ్లరాదూ?

అప్పారావు : నువ్వా మాట మనఃస్ఫూర్తిగానే అంటు న్నావా?

ఆనందం : ఆహా!

అప్పారావు : సరే! తప్పేదేముంది! అలాగే వెడతాను. సినిమానుంచి ఆలా హోటల్‌లో ఎంగిలి పడి, వెన్నెలలో నడుచుకుంటూ ఇంటి కొచ్చేస్తాం! ఏమంటావు?

ఆనందం : బ్రహ్మాండమైన ఆలోచన! మరి కదులు త్వరగా!

అప్పారావు : నువ్వలా త్వరపెట్టకు! డబ్బులివ్వందే ఎలా వెళ్ళనూ! ఎంతో అక్కర్లేదు! మా ఆవిడకు మల్లె పూలు పావలా! మిరప కాయ బజ్జీలు మరో పావలా! రిక్షాకి అర్ధ రూపాయి. మరిచి పోయినా...సినిమా

---

## మంచి సంసారం

మంచి మగనికి చెవుడు, మంచి ఇల్లాలికి గుడ్డితనం.. అంటే ఏదీ వినీ విననట్లు నటించే భర్త, కంటిముందు జరిగేది చూచినా దానిని పట్టించుకోని ఇల్లాలు—సుఖపడతారు.

—ఫ్రెంచి సామెత

---

పాటల పుస్తకం 15 పైసలు. సినిమాకి అయిదు. హోటల్లో భోజనం మూడు. సిగరెట్లు షరేసరి. మొత్తం పదిహేను! చాలు, సరిపెట్టుకుంటాను!

ఆనందం : నీ తద్దినం పెట్టుకో! పామ్మొకరిది, షోకొకరిదీ అని, మీ ఆవిడతో నువ్వు సినిమా కెడితే నేను డబ్బు లివ్వాలా! అవతల పెళ్లివారికి కాఫీ లివ్వటానికికూడా డబ్బుల్లేక నే నఘోరిస్తుంటే?

అప్పారావు : అయితే, సినిమా ప్రోగ్రామ్ కాన్సిల్! హాయిగా ముగ్గురం పేకాడుకుందాం!

ఆనందం : పేక పారేశాం!

అప్పారావు : కొత్తది కొందాం!

ఆనందం : డబ్బుల్లేవురా, బాబూ!

అప్పారావు : నీ దగ్గర లేవనీ, ఉండవనీ నాకు తెలియదూ! మ వ్వెప్పుడు శివాలయమే! గోవిందాన్ని అడుగుతాను.

( గోవిందం ప్రవేశం —నీటుగా ముస్తాబై.)

గోవిందం : ఏరా! నువ్వింకా వెళ్ళలేదూ?

అప్పారావు : ఏదీ వెడదామనుకుంటున్నా! ఓ అరవై ఇలా పారెయ్యి!

గోవిందం : ఏమిటి చిత్తుకాగితాలా! ... మా నాయనే! పాపం, చాలా శ్రమపడ్డావు! ఇక వెళ్లరా!

( బయటినుంచి 'గోవిందాచార్లూ' అన్న కేక.)

ఆనందం : ఒరేయ్, అప్పారావూ, చూ డెవరో!

అప్పారావు : ఆఁ ఎవరో అప్పులాళ్లయి ఉంటారు!

ఆనందం : ఓరి శని వెధవా! కాదురా! నరసింహమేమో చూడు! ( అప్పారావు బయటికి కెడతాడు.)

ఆనందం : ఏరా అంతా రెడీయా! ... ఆఁ నువ్వు ముం దా షేక్స్‌పియర్‌ని ముందేసుకు కూర్చో!

గోవిందం : ( పుస్తకాలు వెతికి ) షేక్స్‌పియర్ లే డిక్కడ!

ఆనందం : నన్నయ్య, తిక్కన ఎవరూ లేరా!

గోవిందం : లేరు! అభిసారిక, రేరాణి, మదన, రమణి...

ఆనందం : ఓరి! అప్రాచ్యుడా! వాళ్ళందర్నీ బల్ల క్రిందకు పంపు కాసేపు. క్విక్! బెనర్జీ, గుప్త, నడకర్ణి, లాల్ ...

గోవిందం : ఉన్నారు!

ఆనందం : అయితే, వాళ్లతో తంటాలు పడు ... సరిగా కూర్చోరోయ్ ... ఆఁ! అలా శీవిగా ఉండు! నే నీ లోపలి అవతారం మార్చుకుని వస్తా...

( హడావుడిగా వెడతాడు. )

( నరసింహం గారు మాడు మీద చెయ్యేట్టు కుని మొహం ముడుచుకు వస్తాడు. అప్పా

రావు వెనకాలే వస్తాడు. )

అప్పారావు: ఇలా దయచేయండి! ( నరసింహం గదంతా పరికించి కూర్చున్నాక ) ఎలా ఉంది నాన్నా?

నరసింహం : నా పిండాకూడులా ఉంది!

గోవిందం : ఏమైందిరా!

నరసింహం : నా దెవసం! ఆయ న్నడిగే దేమిటి? న న్నడిగితే చెప్పనూ?

అప్పారావు : ( వచ్చే నవ్వు ఆపుకుంటూ ) ఏం లేదురా! మెట్ల క్రింద గుమ్మం లేదూ ...

నరసింహం : ఆ బోడి నవ్వెందుకూ మధ్య ... ఇల్లు కాలి ఒక డేడుస్తుంటే, గడ్డం కాలి ఒక డేడ్చాడుట!

అప్పారావు : క్షమించాలి! నవ్వను! మీ రో క్షణం స్తిమితంగా కూర్చోండి! ... ఈయన తల వంచని వీరుడిలా ...

నరసింహం : ఆ కూతే కుయ్యొద్దన్నాను. ఎంత పింజారి వెధవలైతేమాత్రం, ఎంత ఇళ్ళు అద్దె కిచ్చుకున్నా, అవేం గుమ్మాలయ్యా! అఁ! అంత క్రిందుకా మరీనూ! ... అబ్బబ్బ!... ఇశ్శో!

అప్పారావు : తలవంచని వీరుడిలా, ఈయన రా బోయ్యాడు. అయితే, ఆ గుమ్మం ఎలా కనిపెట్టేసిందో, అయ్ ఇంత పొగరా నీకు! అని ఓ ముద్దెట్టుకుంది.

నరసింహం : నా శ్రాద్ధం బెట్టలేదూ! ముద్దుట ముద్దు. అయినా నీ తెలివి తెల్లవార! ( మాడు పట్టుకుని ) ఇక్కడటయ్యా ముద్దు! ముద్దు ముక్కలుగానూ!

అప్పారావు : అయ్యా! అలా కసురుకుని లాభం లేదు. ఆడాళ్లకు మనను పుడితే ఎక్కడైనా పెట్టుకుంటారు.

నరసింహం : ఒళ్లు బలిస్తే అంతే మరి!

అప్పారావు : పైగా, ఓ మంచి ముక్క సెలవియ్య మంటారా?

నరసింహం : అఘోరించూ! దానిక్కూడా నా పెత్తన మెందుకూ? నేనేం స్పీకరునా?

అప్పారావు : బ్రహ్మగారు మనను ఏ గుణానో ఉండి, మీలో అందమంతా ఆ బట్టతలమీద కుప్పగా పోశాడు. ఆహా! నాకు కవిత్వం రాదు గానీ, వస్తేనా బట్టతలోపాఖ్యానం వ్రాశేవాడిని!

నరసింహం : చాలు చాల్లేవయ్యా — మాటలు నేర్చావ్! మాడు కొబ్బరి కాయలా పగిలి నే నేడు స్తుంటే నీకు నవ్వులాటగా ఉందా! ఆఁ అందుకే అన్నారు, మొగుడు చచ్చి ఒకతె ఏడుస్తుంటే, మిండగాడొచ్చి కన్ను కొట్టాట్ట! ... ఊఁ సరేలే! ... ఇంతకూ గోవిందాచా ర్లెవడు?

అప్పారావు : నిజం చెప్పమంటారా?

నరసింహం : ఆహా!

అప్పారావు : శఠగోపం అనంతాచార్లు, వారి ఆదర్శ సతీమ తిలకం మందరాంబాళ్ ఎన్నియో పూజలు, మరెన్నియో వ్రతాలు చేసి, లెక్కకు మిక్కుటమైన పుణ్యక్షేత్రాలు సందర్శించి, పోలెరమ్మ, గంగానమ్మ, అలివేలు వెంకమ్మ — ఇలా దేవుళ్లకు మొక్కుబడులు చెల్లించగా, వారి కోరికలు దీరి, వారి తపఃఫలంబోయనగా ఓ అర్ధరాత్రి వారికి ఓ బుడత డుద యించెను. వాడు కన్నవారి మనంబులు ఆనంద సందోహ వీచికల తేలియాడ, దిన దిన ప్రవర్తమానుడై గోవిందా చార్లను నామంబున పెరిగి పెద్దవాడై విద్యాబుద్ధులు నేర్చినవాడై, మీ కట్టె దుట, ఇనుపాననమున, భక్త మార్కం డేయుని వగిది కూరుచుండెను. అవ్వి ధంబున ...

నరసింహం : నాయనా! డబ్బాలో గులకరాళ్లేసినట్లు, ఆ మోత భరించలేను. నీకు నమస్కారం. క్షణ మాగు! ... ( గోవిందాన్ని పరీక్షగా చూసి ) అయితే, గోవిందాచార్లు నువ్వన్న మాట! బాగుంది!

గోవిందం : అవునండి!

( ఆనందం ప్రవేశిస్తాడే )

ఆనందం : నమస్కారం, సార్? కులాసా?

నరసింహం : నువ్వెవరు? ఇన్స్యూరెన్సు ఏజెంటులా యోగక్షేమాలు విచారిస్తున్నావ్!

అప్పారావు : వాడి పేరు ...

ఆనందం : ఆనంద్ అంటారండి!

నరసింహం : ఆ ఆనంద్‌కు అటు ముందు, ఇటు వెనక ఏం లేదా! తోక తెగిన కుక్కలాగా అదేం పేరు?

ఆనందం : పూర్తి పేరు సంధ్యావందనం శ్రీకృష్ణ అనంత విఠల సత్య ప్రేమానంద అవధాని! ... ఒరేయ్, అప్పారావూ!

అప్పారావు : చిత్తము, దేవరా!

ఆనందం : అఁ చెప్పండి, సార్! మీలాంటి పెద్ద లిలా వచ్చి, మా గదిని పావనం చెయ్యటం చాలా ఆనందంగా ఉంది! ఏం తీసుకుం టారు? బాగా అలసిపోయారు. కాస్త కాఫీ తెప్పించమంటారా?

నరసింహం : వెధవ కాఫీ పోనిద్దూ! తెల్లారి లేచిన దగ్గర్నుంచీ పంచామృతాల్లా కాఫీ ఏమిటి! జీవితం మీద విరక్తి పుడుతోంది!

అప్పారావు : అలా అనకండి, సార్! మా బ్రహ్మానంద విలాస్‌లో కాఫీ తాగారంటే జన్మ చరి తార్థ మవుతుంది. ఏ డేడు పధ్నాలుగు లోకాలు లీలామాత్రంగా గోచరమై అనంత సౌఖ్యమూ కలుగుతుంది. కాదనకండి మరి!

నరసింహం : నా బొంద! ఉన్న ఒక్క పిల్లదానికీ యోగ్యుడైన మొగు డెక్కడ అఘో రించాడో వెతకలేకే ప్రాణం పోతున్నది.

ఆనందం : మీరేం దిగులు పెట్టుకోవద్దు! మీ పిల్ల పెళ్లిచేసే పూచీ నాది. దిగులు పడద్దు... ఒరేయ్, అప్పారావూ! నాలుగు స్పెషల్ స్ట్రాంగ్ కాఫీ ...

అప్పారావు : అలాగే! ఇదే ఆంజనేయుడిలా మెట్లు దూకేస్తున్నాను.

నరసింహం : ఇదిగో, హనుమంతరావూ! నాకు షుగరు వెయ్యవద్దని చెప్పు.

అప్పారావు : ఈ వయస్సులోనే షుగర్ కంప్లయింటా తమకు?

నరసింహం : అయ్యా! ఆడపిల్లల తండ్రులకి రోజుల్లో ఒక్క షుగర్ కంప్లయిం టేమిటి? బ్లడ్ ప్రెషరూ, ఆస్తమా, డబుల్ టైఫాయిడ్, కలరా అన్నీ జాయింటుగా వస్తాయి!

ఆనందం : నువ్వెళ్లరా! ( అప్పారావు నిష్క్రమణ ) నిజం చెప్పాలంటే మీరు రావలసినచోటుకే వచ్చారు. మా వాడని పొగట్టం కాదుగానీ, మా గోవిందాచార్లు మీ కల్లుడౌతున్నా డంటే నా మటుకు నాకు ఈర్ష్యగా ఉంది. నాకు పెళ్లి కెదిగిన కూతురే ఉంటే కళ్లు మూసుకుని వాడి చేతుల్లో పెట్టి ఉండేవాడిని! ప్చ్! ఈ జన్మకు లాభంలేదు!

నరసింహం : నేను వస్తూ, వస్తూ మీ కాలేజీకి వెళ్లి వచ్చాను. అక్కడ ...

ఆనందం : అరెరే! మీ రొస్తారని తెలిస్తే కాలేజీకి వెళ్లేవాళ్లమండీ!

నరసింహం : లేకపోతే వెళ్లరా?

ఆనందం : ఎంతమాట! వెడుతూనే ఉంటామండీ! కాకపోతే మీతో అబద్ధమెందుకాడాలీ! మా కాలేజీ అంతా విజయనగరం సంతమకోండి! స్టాఫ్‌కీ, ప్రిన్సిపాల్‌కీ పడదు. ప్రిన్సిపాల్‌కీ, పిల్లలకూ కొట్లాట! కులాలు, మతాలు, వర్ణాలుకాక, లెక్కలేనన్ని ముఠాలు, పార్టీలు. రాజకీయాల్లో ప్రవేశించే వాళ్లకు మా కాలేజీలో ట్రెయినింగ్ బాగా ఇస్తారు. అయ్యా, అదీ సంగతి! చదువుమాత్రం వాళ్లు చెప్పరు! అథవా చెప్పినా మా కుర్రాళ్లకు అక్కర్లేదు.

నరసింహం : మీ రసలు కాలేజీకే వెళ్లరట! ఒకరు నిప్పయితే, మరొకరు గాలట! ఇద్దరూ ఎప్పుడు, ఎక్కడ ఉంటారో బ్రహ్మకైనా తెలియదుట!

ఆనందం : చెప్పారా? వెధవలు నాకు తెలుసండీ! మన వాళ్ల కున్న జబ్బే అది. ఇద్దరు కలిసి ఉంటే చూడలేరు. చూసి సహించలేరు. అది మన తెలుగువాళ్ల దౌర్భాగ్యం. ఇద్దరు కలిస్తే రాజకీయాలు, ముగ్గురు కూడితే ముఠాలు, ఆ పైన నలుగురు జమైతే దొమ్మీలు అఖిల భారత రాజకీయ పార్టీ స్థాపితమూను!

నరసింహం : మీకు ఊరినిండా అప్పులున్నాయిట!

ఆనందం : ఉన్నాయండీ! అదిమాత్రం కరెక్టే! ఎందు కంటారా? ఒకరి జోలికి శొంటికి పోకుండా ఒకర్ని అగ్గిపెట్టెగానీ, అర్ధరూపాయి డబ్బులుగానీ అడక్కుండా మన చావు మనం చద్దామంటే కుదరదు గదా? ప్రతి తల చెడిన నాజమ్మా, మన వెనకాల ఫత్తే దారులా తిరిగి, నానా రకాల పుకార్లూ పుట్టేస్తాడు. పీడి నెత్తిన ఏగానీ పెట్టినా, ఈ ఊళ్లో చెల్లదు అని టముకువేస్తారు. అయ్యా, అదీగాక అప్పు ఎవరికి పుడుతుంది? సరపతి ఉన్నవాళ్లకేగా! మా అప్పారా వంటాడూ — అప్పు చెయ్యని వాడు

కంచర గాడిద జన్మ ఎత్తుతాడని ఎవరిదో శాపం ఉందిట! ఇంత బ్రతుకూ బ్రతికి గాడిద, అందులోనూ కంచర గాడిద జన్మ ఎత్తాలంటే బాధగా ఉంటుంది. అప్పులంటే ఉన్నాయి గానీ, అవేం పీకలమీాది కొచ్చేవేం గాదు.

నరసింహం : ఏమిటోఅంతా కలయో,వైష్ణవమాయయో లాగా ఉంది... చూడు, నాయనా, గోవిందాచార్యా, నీ వయస్సెంతన్నావూ?

గోవిందం : ( ఏదో చెప్పబోయి, ఆనంద్ వేపు చూసి ఆగుతాడు. )

ఆనందం : రిజిస్టర్‌లో వయస్సా, నిజమైన వయస్సా మీారడిగేది?

నరసింహం : రిజిస్టర్‌లో దెంతేమిటి?

ఆనందం : పంతొమ్మిది! మీారాశ్చర్యపోతున్నారు, నాకు తెలుసు. అలా పోతులా ఉన్నాడు —వీడికి పంథొమ్మి దేమిటా అంటారు. అంతేగా? మా వాడు మంచి క్రీడాకారుడు. హాకీలో ఫస్టు! ఫుట్‌బాల్‌లో బెస్టు. క్రికెట్‌లో సవ్యసాచి — బాటింగ్, బౌలింగ్‌లోనూ, ఈవేళో రేపో ఫారిన్ వెళ్లచ్చు. అన లీపాటికి ఆఫ్రికాలో ఉండవలసిన వాడు. ఇదిగో, పరీక్షలు వచ్చేస్తున్నాయి. అందుకని ఉండి పోయాడు.

నరసింహం : ఇంతకూ అసలు వయస్సెంత!

ఆనందం : ( నవ్వి ) అయ్యా, క్రితం సారి ఎన్నికలప్పటికి ఇరవై ఒకటి. మరింకా ఎన్నిక లెన్నాళ్ళున్నాయో!

నరసింహం : అర్ధాంతరపు ఎన్నికలు అవిగో, ఇవిగో అంటున్నారు.

ఆనందం : అయితే ఇరవై మూడు. అంతేనండీ! నాకంటే ఎంతా అర్నెల్ల 13 రోజులు మాత్రమే చిన్న. నా కిరవై నాలుగు.

( అప్పారావు కాఫీ గ్లాసులతో ప్రవేశం. )

అప్పారావు : కాఫీ, సార్!

ఆనందం : అరే! నువ్వు తెచ్చావేరా!

అప్పారావు : మాటినీ వదిలారుట! జనం కాఫీ మంచి నీళ్లలా తాగేస్తున్నారు. ఆగండన్నాడు. మన కిదేం కొత్త ... అందుకుని నేనే తెచ్చా! ... తీసుకోండి! ( అందరూ ముందర కొంగి తీసుకోబోతారు ) ఆగండి!

ఆనందం : అదేం?

అప్పారావు : మీాకు షుగర్ కంప్లైయింట్ గదా! ( క్షణం నాలుగు గ్లాసులు పరీక్షించి, ఒకటి తీసి ) ఆఁ ఇది మీాది. ( నరసింహం గారి కిస్తాడు. మిగతావి తలొకటీ తీసుకుంటారు. )

నరసింహం : ( కాఫీ కాస్త చప్పరించి వాంతయ్యే వాడిలా ) ఓరి, మహాప్రభో!! ఇదేమిటి?

ఆనందం : ఏమైంది?

అప్పారావు : స్పెషల్ కాఫీ గదరా! ఈగ పడి ఉంటుంది!

నరసింహం : నా పిండాకూడు! ... నీకేమని చెప్పాను?

అప్పారావు : నాయనా, ఆడపిల్ల తండ్రిని, షుగర్ కంప్లైయింట్! — పంచదార వద్దని!

నరసింహం : దీంట్లో పంచదార తగలెట్టాడు శని వెధవ!

అప్పారావు : క్షణం ఆగండి. ( తన దగ్గరున్న గ్లాసులో కాఫీ సిప్ చేసి ) అయ్యా, ఇది మీాది! తీసుకోండి!

నరసింహం : ఏం చావొచ్చిందిరా, తండ్రీ! నీ ఎంగిలి కాఫీ తాగమంటావుటయ్యా నన్ను?

ఆనందం : ఒరేయ్, అప్పారావు! నువ్వేపనీ సవ్యంగా చెయ్యవు గదరా!

గోవిందం : నా కాఫీలో షుగర్ లేదు!

ఆనందం : ( కాఫీని సిప్ చేసి ) ఇదీ అంతే!

నరసింహం : ఇంకేం! ఈ శిఖామణిగారు మూడు షుగర్ లేకుండా, ఒకటి షుగర్‌తోటీ కాఫీ చెప్పి ఉంటాడు.

అప్పారావు : ఏం గాదు. నే సరీగానే చెప్పా. ఆ అడ్డ మొహం వెధవ ఎలా విన్నాడో! ... ఒరేయ్, అన్ని కాఫీలు తిప్పి తీసుకుపోతే, ఏందయ్యా, అరువు బేరానికి ప్రొద్దస్తమానం జాతర అంటాడేమో?

ఆనందం : అరువేం ఖర్మరా! డబ్బు ఎడంచేత్తో విసిరేసి కుడిచేత్తో కాఫీ పట్టుకురా!

అప్పారావు : భేష్షైన మాట చెప్పావు! మరి డబ్బులో...

గోవిందం : నేనిస్తా, రా! ( అప్పారావు, గోవిందం లోపలకు వెడతారు. )

ఆనందం : అయ్యా! మా వాడిని చూశారూ? నచ్చినట్లు మీా మొహమే చెబుతోంది! అయ్యా, నిజం చెప్పద్దూ? మా వాడు నాటకాల్లో హీరో వేషాలే వేస్తాడు. అది వాడి శపథం. ప్రతి ఆడపిల్ల వాడి చల్లని చూపుకోసం, తియ్యటి మాటకోసం పడిగాపులు, ప్రాణాచారాలు పడుతుంటారు. ఒకరిద్దరు, 'గోవ్! లక్ష రూపాయల కాష్ తెస్తాను. పద, ఈ పాడు లోకాన్ని వదిలి ఎగిరిపోదాం' అని బలవంతం కూడా చేశారు. అయితే మా వాడు బుద్ధిమంతుడు, అమాయకుడు, సత్తెకాలపు సత్తెయ్య, మట్టిలో మాణిక్యం కాబట్టి వాళ్లను తల్లి తండ్రులకు వాపస్ ఇచ్చేశాడు. అదే నాబోటి రంగేలీ రాజా అయితే 'ఫల్ మోహనరంగా' అని ఎగరేసుకు పోయ్యేవాడు.

( గోవిందం, అప్పారావు ప్రవేశం. )

అప్పారావు : ఒరేయ్! వీడికి మనియార్డ రొచ్చింది రోయ్! చద్దన్నం తిన్నమ్మ లాగా చూడెలా ఉన్నాడో!

ఆనందం : సరే, వెళ్లరా!

అప్పారావు : వెడుతున్నా! నాకు గోల్డ్ లీఫూ, నీకు బర్కిలీ, మరి, గోవిందం, నీకేం సిగరెట్లు కావాలి!

ఆనందం : వాడు సిగరెట్లు కాలుస్తాడురా! గమిడి గేదెలా మొహం నువ్వూనూ!

అప్పారావు : సారీరా, బ్రదర్! ఏమిటో డబ్బుమొహం చూసేసరికి, మనసంతా పాడయిపోయింది... వస్తా ... ( నిష్క్రమణ )

ఆనందం : అయ్యా, ఇంతకూ అమ్మాయి సంగతి చెప్పలేదు.

నరసింహం : ఏం చెప్పాలో, ఎలా చెప్పాలో తెలియటం లేదు!

ఆనందం : అదేం?

నరసింహం : మీా వాడికి మా పిల్ల తగదేమో అన్న సందేహం పీడిస్తున్నది.

ఆనందం : భలేవారే! చల్లకొచ్చి ముంత దాచటం దేనికి?

నరసింహం : ( నవ్వి ) అంతేనంటారా! సరే, కానివ్వండి! ... మా అమ్మాయి పేరు అనంతలక్ష్మి. చదువంటూ ఏమీా రాదనే చెప్పాలి. ఇదిగో, కాకపోతే తెలుగు సినిమా పత్రికలు అవీ చదవగలదు, ధారాళంగా!

ఆనందం : చాలు! ఆమాత్రం లోకజ్ఞానముంటే ఇండియాను ఏలేయవచ్చు! అయినా ఇల్లే శ్రీరంగమై, భర్త శ్రీరంగనాథుడిలా భావించుకునే పవిత్ర భారత స్త్రీకి చదువెందుకు? ఏదో మొగుడన్న వాడికి క్షేమ సమాచారాలు రాసుకోగలిగితే చాలు!

నరసింహం : పైగా నిజం చెప్పాలంటే, అమ్మాయి కొద్దిగా నలుపు. చిన్ననాడే అమ్మవారొచ్చి ఓ కంట్లో చిన్న పువ్వు వేసింది. అయితే దానివల్ల చూపు కొచ్చిన అడ్డంకేం లేదు! ఇక పోతే ఇంటెడు చాకరీ ఓపిగ్గా, చక్కగా ఒక్కతే చెయ్యగలదు!

ఆనందం : ఆహా! ఎంత మంచి ముక్క చెప్పారండీ! మా వాడు నిజంగా అదృష్టవంతుడే! ఏ దెక్కడ తిరిగొచ్చినా, ఇంటి కెళ్లేసరికి షడ్రసోపేతమైన భోజనమూ, సకలోపచారాలూను! ఆహా! అంతకంటే ఏం గావాలండీ మగ వాడికి! ఎర్రగా దబ్బపళ్లలా పెళ్లాం ఉంటే ఏమిటి సుఖం? మరిసారి నెల తప్పితే వంటకు తప్ప పనికి రాని ఆడదానితో ఏమిటి సుఖం! ఏమంటారు!

నరసింహం : ( ఉత్సాహంగా ) బాగుంది! మీారు బహు యోగ్యులు. కష్ట సుఖాలు తెలిసిన వారున్నూ! పోతే ఇంకొక్క విషయం మనవి చేస్తాను.

ఆనందం : చెప్పండి. సందేహ మెందుకు?

నరసింహం : ఒక్కగా నొక్కతె కావటంతో, గారాబంగా చూశానండీ! దానితో దాని మాటకు ఎదురు చెబితే మటుకు సహించ లేదండీ! అవతలవా డెవడైనా సరే, ఈడ్చి నాలుగు తన్నుతుంది. వెన కాడదు.

ఆనందం : భేష్! అయ్యా, నరసింహంగారూ! మీా అమ్మాయి సరసురాలేనండోయ్!

నరసింహం : నిజమా?

ఆనందం : ఆహా! ఇంటి ఇల్లాలు ఆమాత్రం గడసరితనం నేర్వకపోతే, సంసారంతో మజా ఉండదండి! శ్రీకృష్ణ పరమాత్మ అంతటి వాడు పెళ్లాం ఈడ్చి తన్నితే సరిపెట్టుకున్నాడు. ఎందుకంటాను! సరసమండీ, బాబూ! అసలు నన్నడిగితే పెళ్లాంచేత ఆ మాత్రం తన్నులు తినని వాడి బ్రతుకేం బ్రతుకండీ! ఆల్ రైట్, సార్! నామటుకు

నాకు మీ అమ్మాయి నచ్చింది. ఏరా, గోవిందా, పచ్చజెండా ఎత్తేదా?

గోవిందం : నీ ఇష్టంరా, ఆనందం.

ఆనందం : చూశారా? వాడు గంగిగోవు! డొమెస్టిక్ ఎనిమల్! కానివ్వండి, నరసింహంగారూ, మామిడాకు, మంగళ వాయిద్యాలు ఆయత్త పరచండి!

( నరసింహంగారు లేచి గోవిందాచార్యను పరీక్షగా చూస్తూ ఆలోచిస్తుంటాడు. )

ఆనందం : అయ్యా! మీ సందేహమేమిటో బోధ పడకుండా ఉంది. మా వాడు యోగ్యుడు. కనక కట్నాలు కానుకల విషయంలో ఆశ్బే పేచీలు, పట్టింపులు ఉండవు. ఆలస్యం అమృతం విషం అన్నారు. కానివ్వండి!

నరసింహం : అది కాదయ్యా ఆనందరావూ, ఓ చిక్కొచ్చి పడ్డది.

ఆనందం : చెప్పండి! నే నున్నాను. సమస్యను చిటికెలో పరిష్కారం చేసేస్తాను.

నరసింహం : నువ్వంతటి వాడివే! నాకు తెలియదూ... మా అమ్మాయి ఈ సంబంధానికి ఒప్పుకో దేమో నయ్యా!

ఆనందం : అదేం? మీ అమ్మాయి కింకా ఏమైనా కోరిక లున్నాయా!

నరసింహం : ఉండవుటయ్యా. అందులోనూ మా పద్మ ...

ఆనందం : పద్మా! ... అనంతలక్ష్మి అంటిరే! ...

నరసింహం : ఊ ఊరికే తమాషా కన్నాను. మా పద్మ యూనివర్సిటీ కంతటికీ ఫస్ట్‌గా పాస యింది.

ఆనందం : నిజమా? !

నరసింహం : ఆ మరేమి టనుకున్నావు? కుందనపు బొమ్మలా ఉంటుంది. అమృతం కురిసి నట్లు, చక్కగా పాడుతుంది. అల్లికలు, కుట్లు, వంటా వార్పూ అటుంచి, మాంఛి ఆర్టిస్ట్! చుక్కల్లో చంద్రుడిలా, ఎక్కడున్నా కొట్టొచ్చినట్లు కనబడు తుంది. అయిందా! హంసలా నడుస్తుంది. నెమలిలా పురి విప్పుకుని నృత్యం కళ్ళ జిగేల్‌మనేలా చేస్తుంది. పైగా ఒక్కగా నొక్క కూతురు నాకు! నా అయివేజు ఎంతనుకున్నావు?

ఆనందం : ( ఆశ్చర్యంగా ) ఎంతేమిటి?

నరసింహం : ముప్ఫయ్యెకరాలు మాగాణి! పదెకరాల కొబ్బరి తోట! లంకంత ఇల్లు. అందులో తామర కొలనులో నిజంగా మా పద్మ, పద్మమే! అపురూపంగా పెంచుకున్నాను. అలాంటి పిల్లను ...

ఆనందం : చెప్పండి! ఆగారేం?

నరసింహం : అహ ఏం లేదు. చదువుల సరస్వతిని చూసి, చూసి ఈ మూగి మొద్దు కివ్వటమా అని!

గోవిందం : ఏమండీ!

నరసింహం : ఏమయ్యా, ఆనందరావూ! శ్మశానంలో పాతేసిన రాయిలాగా, మాటా పలుకూ లేకుండా ఉంటాడేం! ఈ బుద్ధావతారాన్ని అల్లుడిగా చేసుకునే కన్నా, మా ఊళ్ళో బొడ్డురాయిని ఇంట్లో పెట్టుకుంటే నయం! లాభం లేదు. మావాడు శివా లయం లోని నందీశ్వరుడు! అంతే!

ఆనందం : అయ్యా, నరసింహంగారూ! అన్నీ అబద్ధాలు చెప్పి, మా వాడికి అన్యాయం చేస్తారా?

నరసింహం : ఏమిటయ్యా అన్యాయం! ఈయన్ను గురించి నువ్వంతా నిజమే చెప్పావా! పోలియో వ్యాధి వచ్చిన వాడిలా ఉన్న ఇతను. మేటి ఆటగాడా! మొహంలో ప్రేత కళ తప్పలేదు, ఇతను నటుడా!

గోవిందం : అవును!

నరసింహం : నోరు మూసుకో!... అంతే! ఏమయ్యా! పెళ్ళికొడుకంటే ఎలా ఉండాలి?

ఆనందం : ఎలా ఉండాలి?

నరసింహం : కోడెదూడలా బుసలు కొడుతూ, రంకె లేస్తూ, మెరుపులా మెరుస్తూ, మబ్బు విడిచిన ఎండలాగా, చూసేవాళ్ళకు చురుక్కుమనేలా ఉండాలి. వాణ్ణి పెళ్ళి కొడు కనేది! అంతేగానీ, ముసలెద్దులా ఉంటే ఏం ప్రయోజనం! కొత్త కాపురం జోడు గుర్రాల సార్వులా వెళ్ళాలి! గుర్రాన్నీ, గాడిదనూ కలిపి కడితే ఏముంది?

గోవిందం : అంటే నేను గాడిదనా?

నరసింహం : కాక గుర్రానివా! మా బాబే! ఇదిగో, నువ్వు గుర్రాని వైనా సరే నా కభ్యంతరం లేదు. అనుకో! జట్కా గుర్రానివి! అంతే!

ఆనందం : పరాచికా లాడుతున్నారా?

గోవిందం : మాటలు తిన్నగా రానివ్వండి!!

నరసింహం : పట్టె గొడ్డుకు అరుపు లెక్కువని, నీతో నాకేమిటి...నాయనా, ఆనందరావూ, మాట!

ఆనందం : ( నీరసంగా ) ఏమిటి?

నరసింహం : కుర్రాడంటే నీలా ఉండాలి! ఆస్తితో నాకు పనే లేదు! నువ్వు ఊ అంటే... మా అమ్మాయి నిచ్చి పెళ్ళి చేస్తా!

ఆనందం : నిజంగానా! ! ...

నరసింహం : అహ! మాట తప్పను! సరేనా?

ఆనందం : కానీ ... నా కిదివరకే పెళ్ళయింది!

నరసింహం : ఓరి, మహాప్రభో! ఎన్ని కష్టాలు పెట్టావురా తండ్రీ! ఆ బోడి ముక్క ఏడవటానికి అంత నటన దేనికి! వెధవ గోల...

అప్పారావు : ( ప్రవేశం ) అయ్యా, కాఫీ!

నరసింహం : ఇంత విషం తేకపొయ్యావూ! వెధవ తద్దినం ( నిష్క్రమణ )

అప్పారావు : అదేమిట్రా! మయసభలో దుర్యోధనుడిలా వెడుతున్నాడు. . . ఏరా ఆనందం! కొంటిచ్చావా! ... ఏరా, గోవిందా!

గోవిందం : వెధవ చూ డెలా కూర్చున్నాడో, కొత్తగా ముండమోసిన ఆడదానిలా! వీడుట నాకు పెళ్ళి చేస్తాడుట! ఒరేయ్, ఏబ్రాసి వెధవా! బుద్ధిగా కుర్చీలో కూర్చో! అన్నీ నే సెటిల్ చేస్తాను! చేశాడు నమ్మినందుకు, నా నెత్తిన అరగజం పైను గుడ్డ కప్పాడు. వాడి మొహం చూడు, వాడిపోయిన పెసరట్టులా ఎలా ఉందో!

ఆనందం : పొరపాటై పోయింది!క్షమించరా, గోవిందం!

అప్పారావు : ఏమిటి, కథ అడ్డం తిరిగిందా?

గోవిందం : అది తిరగలేదు. వీడు తిప్పేశాడు. ఒరేయ్, అప్పారావూ! వాడు విలన్! నా పండంటి జీవితాన్ని, చాపలా చుట్టి, గిరవాటేశాడు! బ్రూట్! వీడి సంగతి నే చెబుతాను! ... ఏ దా చిల్లర?

అప్పారావు : మరే! ... గది అద్దె బకా యుందిటగా! పందా తీసుకుని గుర్నాథం సరికి సరి! ఫో అన్నాడు! ... ఇంద, కాఫీ త్రాగు!

గోవిందం : నా శ్రాద్ధం పెట్టుకుంటూ! మీరంతా నా మీద పగబట్టి వచ్చారు కదూ? నాకు తిక్క రేగితే, మనిషిని కాను! ఒరేయ్, నే తిరిగొచ్చేలోగా మీరు వెళ్ళిపొండి! లేకుంటే నే నేం చేస్తానో నాకే తెలియదూ! ... వింటున్నారా! ... వస్తా... ( కోపంగా వెడతాడు. )

అప్పారావు : ఆనందం! వీడేమి టిలా కాలే పెనం మీది నీటి చుక్కలా మండిపడుతున్నాడు! ఏమైంది?

( గుర్నాథం పరిగెత్తుకుంటూ వస్తాడు )

గుర్నాథం : అప్పారావూ! ... గోవిందాన్ని చూడటానికి పెళ్ళివా రొచ్చారన్నావు! ఏరి?

ఆనందం : ఇప్పుడే వెళ్ళాడు.

గుర్నాథం : వెళ్ళాడా?

అప్పారావు : ఏం? నీ కెందుకు? ఆయన నీకు తెలుసా?

గుర్నాథం : తెలియటం! బాగా తెలుసు! ఎటెళ్ళాడు!

ఆనందం : ఏమో, ఎటు వెళ్ళాడో! వచ్చి నానా యాగీ చేసి మరీ వెళ్ళాడు!

గుర్నాథం : అయితే ఇంకేం! అతనే!

అప్పారావు : ఇంతకూ ఎవరతను!

గుర్నాథం : మా ఫ్రెండు స్నేహితుడు!

ఆనందం : కాదు! ఆయన నరసింహాచార్యులు!

గుర్నాథం : ఇక్కడా పేరు చెప్పాడేమో! కానీ, ఆయన పేరు చలమయ్య! ప్రతి కాలేజీ కుర్రాడి గదికీ వెళ్ళి, తన కొక కూతురుందని, బంగారపు బొమ్మ అనీ, ఆ అమ్మాయికి వరుడు కావాలనీ చెబుతుంటాడు.

అప్పారావు : అంటే అంతా వట్టిదేనా!

గుర్నాథం : నిజం!

ఆనందం : మరి?

గుర్నాథం : ఆ అమ్మాయి ఓ కాలేజీ కుర్రాణ్ణి ప్రేమించి లేచిపోయి, ఆ తరవాత ఆత్మ హత్య చేసుకుంది! అప్పట్నుంచి ... ఇలా...

అప్పారావు : అంటే పిచ్చివాడా?

ఆనందం : అలా లేదే? మాటా, పలుకూ...!

గుర్నాథం : లేదు కాబట్టే నమ్మిస్తున్నాడు ... వస్తా! ఎటు వెళ్ళాడో ఏమో? ... వస్తా ... పట్టుకోవాలి! ( వెడతాడు. )

( ఆనంద్, అప్పారావు మొహమొహాలు చూసుకుంటుండగా తెర. ) *

[ఇందులోని పాత్రలు కేవలం కల్పితాలు.]